## కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంటు కష్టాలే...



భీమదేవరపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మళ్లీ కరెంటు కష్టాలు తప్పవు. అప్పట్ల కరెంటుతోని గోస పడ్డది అప్పుడే మర్చిపోతమా..? కరెంటు కోసం రాత్రిళ్లు టార్చిలైటు పట్టుకుని బాయిలకాడ కావలి ఉండేటోళ్లం.. అయినా ఇట్ల అచ్చినట్టు అచ్చి దాని పాడుగాను కరెంటు బందయ్యేది. మళ్లా కరెంటు కోసం కావలి కాసేది.. ఆ రోజులు గుర్తొస్తెనే వీపులో వణుకు పుడ్తది.. తెలంగాణ వచ్చినంక 24 గంటలు కరెంటేనాయే.. ఎప్పుడంటే అప్పుడు వచ్చి పంటకు నీళ్లు వదులుతున్నం.. కాలిన మోటర్లను ట్రాక్టర్ల తీసుకెళ్లే బాధ లేకుండా పోయింది. ఇప్పుడు మళ్లా కాంగ్రెస్‌కు ఓటేసి మా బతుకులను మేమే ఆగం జేసుకుంటమా.. రైతును బతికించిన బీఆర్‌ఎస్‌కే మా ఓట్లు.

**- గుడికందుల మోహన్, రైతు, ముల్కనూరు**

## పట్వారీలతో గోసపడ్డాం



నడికూడ : కాంగ్రెస్ పాలనలో పట్వారీలతో గోసపడ్డాం. మాకు ఎకరంన్నర భూమి ఉంది. అప్పట్లో పట్వారీ 35 గుంటలకు మాత్రమే పట్టాలో ఎక్కిచ్చిండ్లు. మిగతా భూమిని మేమే సాగు చేసుకుంటానం. కానీ పట్టా లేదు. దీంతోని మాకు రైతు బంధు 35 గుంటలకే పడుతాంది. ఇట్లా చాలా మంది భూములు సాగులో ఉన్నప్పటికీ పట్టాలకు ఎక్కించలేదు. కాంగ్రెస్ నాయకులు మళ్లా పాత పద్దతే తీసుకొస్తామని అంటాళ్లు గానీ, వాళ్లు వచ్చేది లేదు, చేసేది లేదు. ఎనకటి మనుషులు ఎనికటి వేషాలే వేస్తరు గాని కొత్తగా ఏం ఆలోచిస్తరు. కాంగ్రెస్ వాళ్లతో రైతులకు ఇబ్బందులు ఉంటయ్. సీఎం కేసీఆర్ దళారులను తీసేసి మంచి పని చేసిండు.

**- నారగాని చేరాలు, రైతు, నడికూడ**





ధర్మారెడ్డికి మద్దతు ప్రకటిస్తున్న గవిచర్ల ముస్లింలు

## చల్లా ధర్మారెడ్డికి ముస్లింల మద్దతు

సంగెం, నవంబర్ 21 : పరకాల ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డికే తమ మద్దతు ఇస్తున్నామని సంగెం మండలంలోని గవిచర్ల గ్రామ ముస్లింలు ప్రకటించారు. మంగళవారం గ్రామంలో ముస్లిం మైనార్టీల సమావేశం బొలెమియా ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా సంగెం జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ దొనికెల రమ-శ్రీనివాస్, బీఆర్‌ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు పత్తిపాక రమేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని 75 కుటుంబాలు చల్లా ధర్మారెడ్డి కారు గుర్తుకే ఓట్లు వేస్తామని ప్రతిజ్ఞ చేశాయి.

## హోమ్ ఓటింగ్ ప్రారంభం

### జిల్లాలో 379 మంది ఓటు హక్కు వినియోగం

హనుమకొండ/పరకాల, నవంబర్ 21: హనుమకొండ జిల్లా పరిధిలోని వరంగల్ పశ్చిమ, పరకాల నియోజక వర్గాల్లో మంగళవారం హోం ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది.12డీ ఫారం ద్వారా దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు, 80 ఏళ్ల వయసు పైబడిన వారు హోమ్ ఓటింగ్ విధానంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంగళవారం వరంగల్ పశ్చిమలో 236 మంది, పరకాల నియోజకవర్గంలో 143 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. కాగా, పశ్చిమలో హోమ్ ఓటింగ్ విధానాన్ని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ హెచ్‌ఎన్ గోపాలకృష్ణ, కలెక్టర్ సిక్తా పట్నాయక్, సీపీ అంబర్ కిశోర్ ఝా పరిశీలించారు. పరకాలలో ఆరు రూట్లుగా విభజించి హోం ఓటింగ్‌ను నిర్వహించగా, ఎన్నికల నిర్వహణను ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా పరిశీలించారు.

## విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

పరకాల, నవంబర్ 21 : ఎన్నికల విధుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల అబ్జర్వర్ గోపాలకృష్ణ అన్నారు. పోలింగ్ అధికారులు, సిబ్బందికి పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఎలాంటి పొరపాట్లకు తావియ్యవద్దని, అనుకోని సంఘటనలు జరిగితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. పోలింగ్ సమయంలో నిబంధనల మేరకు నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్వో శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కరాటే పోటీల్లో డిస్నీల్యాండ్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

దామెర, నవంబర్ 21 : ఓగ్లాపురం సమీపంలోని డిస్నీల్యాండ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు పల్లా రాకేశ్, అభిరామ్ జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 19న మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో జరిగిన కరాటే (తాంగ్‌తా) పోటీల్లో రాకేష్ గోల్డ్‌మెడల్, అభిరామ్ సిల్వర్ మెడల్ సాధించారు. జనవరిలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. ఈ మేరకు విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ డి.శోభారాణి, డైరెక్టర్స్ రాకేష్‌భాను, దినేష్‌చందర్, ముఖ్య సలహాదారులు దయ్యాల సదయ్య అభినందించారు.

## 'విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి'

దామెర, నవంబర్ 21 : విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని డీఈ సౌమ్యా నాయక్ సూచించారు. మండల కేంద్రంలో హనుమకొండ రూరల్ డివిజన్ స్థాయి విద్యుత్ అధికారుల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సౌమ్యా నాయక్ మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ బకాయిలను సకాలంలో చెల్లించాలన్నారు. ఆన్‌లైన్ చెల్లింపులపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో ఏఏవోలు శ్రీనివాస్, ఏడీఈ దేవేందర్, పరకాల టౌన్ ఏఈ సత్యనారాయణ, ఏఈలు గుర్రం రమేశ్, రవి కుమార్, రాజ్ కుమార్ పాల్గొన్నారు

# అభివృద్ధి చేసిన కేసీఆర్‌కు అండగా నిలవాలి

- బీఆర్‌ఎస్‌తోనే ముస్లింలకు ప్రత్యేక గుర్తింపు
- చల్లా ధర్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- హోం మంత్రి మహమూద్ అలీ
- మైనార్టీల సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యం
- ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి
- పట్టణంలో ముస్లింల ఆత్మీయ సమ్మేళనం



మహమూద్ అలీ, చల్లా ధర్మారెడ్డిని సన్మానిస్తున్న ముస్లింలు

పరకాల, నవంబర్ 21 : ముస్లింలకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని, రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఆయనకు రానున్న ఎన్నికల్లో ముస్లింలు అండగా నిలువాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, హోం మినిస్టర్ మహమూద్ అలీ అన్నారు. పట్టణంలోని ఎంఎస్‌ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన ముస్లింల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమాన్ని ఏ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో ముస్లింల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేశారన్నారు. రంజాన్ పండుగను అధికారికంగా నిర్వహించడంతో పాటు పేద ముస్లింలకు దుస్తుల పంపిణీ, మైనార్టీ బంధు, షాదీ ముబారక్ వంటి పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. పరకాలలో చల్లా ధర్మారెడ్డిని గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుకగా పంపించాలన్నారు. రాష్ట్రంలో రానున్నది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, రానున్న ప్రభుత్వంలో ముస్లింల సంక్షేమానికి సీఎం కేసీఆర్ మరింత కృషి చేస్తారని తెలిపారు. కాంగ్రెస్ పాలకులు ముస్లింలను ఓటు బ్యాంకుగానే వాడుకున్నారే తప్ప, వారి సంక్షేమం గురించి ఎన్నడూ ఆలోచించలేదన్నారు. ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మైనారిటీల బతుకులు మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. గత పాలకుల వల్ల మైనార్టీలు అభివృద్ధికి దూరంగా నిలిచారన్నారు. మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌ను మరోసారి సీఎం అయ్యేలా కృషి చేయాలన్నారు. విపక్షాల మాయమాటలు నమ్మొద్దని కోరారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు నయీమొద్దీన్, మోయినుద్దీన్, జలాలుద్దీన్, జాఫర్ రిజ్వీ, బియాబాని, సోదా రామకృష్ణ, రేగూరి విజయపాల్‌రెడ్డి, బండి సారంగపాణి, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



పరకాల : కండువా కప్పుతున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



నడికూడ: కౌకొండ కాంగ్రెస్ నాయకులకు..

పరకాల/నడికూడ : పలు గ్రామాలకు చెందిన పలువురు విపక్ష పార్టీల నాయకులు మంగళవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బీజేవైఎం మండల అధ్యక్షుడు గోపగాని సాయికుమార్, నాయకులు పిల్లల నాగరాజు, కోడూరి రాజు, తడక సన్ని, సకినాల భరత్, బండారి సాయి, గడ్డం మంజునాథ్, కొయ్యల నవీన్, బొనగాని రాకేశ్, గోపరాజు సాయి, గడ్డం సిద్ధు, గడ్డం సతీశ్, పీ శివ, అల్లె ప్రశాంత్, శివకుమార్, గణేశ్, అర్జున్, శ్రీకాంత్, శ్రావణ్, రాజు, అనిల్, వెంకటేశ్, రవితేజ, రాకేశ్, చందు, హన్మంతు, నవీన్, చిరంజీవి, కరుణాకర్, అన్వేష్, ఇంద్రసేన, నడికూడ మండలం కౌకొండ గ్రామానికి చెందిన మేకల కుమారస్వామి, మేకల రాజేందర్, పూరెళ్ల రాజయ్య, చుక్క రాజేశ్, జన్నారపు సాంబయ్య, బొట్ల రమేశ్, మేకల అనిల్ ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చింతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, పోచారం ఎంపీటీసీ కోరె రమేశ్, 6వ వార్డు కౌన్సిలర్ దామెర మొగిలి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## గ్రామాల్లో జోరుగా బీఆర్‌ఎస్ ప్రచారం

పరకాల/ఆత్మకూరు/ఖిలావరంగల్/దామెర, నవంబర్ 21 : ఎన్నికల్లో చల్లా ధర్మారెడ్డి గెలుపు కోసం గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు జోరుగా ప్రచారం చేస్తున్నారు. మంగళవారం పట్టణంలోని 36వ బూత్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనితా రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. అలాగే, ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామంలో చల్లా జ్యోతి ప్రచారం చేయగా స్థానిక మహిళలు ఆమెకు మంగళహారతులతో స్వాగతం పలికారు. గ్రేటర్ 17వ డివిజన్‌లోని ఆదర్శనగర్‌లో విలీన గ్రామాల బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి చింతం సదానందం ప్రచారం నిర్వహించారు. దామెర మండలం పులుకుర్తిలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ముదిగొండ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు. అలాగే, కోగిల్వాయి, వెంకటాపురం, ల్యాదెళ్ల, పసరగొండ, ఓగులాపురం, ముస్త్యాలపల్లిలో సర్పంచ్‌లు ప్రచారం నిర్వహించారు.




పరకాల : ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనితా రామకృష్ణ



ఆత్మకూరు : నీరుకుళ్లలో చల్లా జ్యోతికి స్వాగతం పలుకుతున్న మహిళలు



ఖిలావరంగల్ : ఆదర్శనగర్‌లో ప్రచారం చేస్తున్న చింత సదానందం



దామెర : పులుకుర్తి గ్రామంలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు